

# రేపు నారాయణపురంలో జిల్లాస్థాయి 'స్పందన'

ప్రజాశక్తి - ఉంగుటూరు

జిల్లా స్థాయి స్పందన కార్యక్రమాన్ని ఈ నెల 17న మండలంలోని నారాయణపురం లయన్స్ క్లబ్‌లో నిర్వహించనున్నామని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా స్థాయి స్పందన కార్యక్రమానికి జెసి, జిల్లా అధికారులంతా హాజరు కానున్నారన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద గోదావరి సమావేశ మందిరంలో, డివిజనల్, మండల కార్యాలయాల్లో, మున్సిపల్ కార్యాలయాల్లోనూ స్పందన సోమవారం ఉదయం పది గంటల నుంచి యధావిధిగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారులు తప్పనిసరిగా కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మాస్కులు ధరించాలని విజ్ఞప్తి చేశారు.

## ధాన్యం కొనుగోలులో

# కుప్పిగంతులు..!

**ఖరీఫ్ ఇబ్బందులను పట్టించుకోని అధికారులు**

**ప్రతి గింజను కొనుగోలు చేస్తామంటూ బీరాలు**

**పండిన పంటలో 60శాతం ధాన్యమే కొనేందుకు ప్రణాళికలు**

**ఎకరాకు వంద సంచులు అవసరంకాగా..**

**75 మాత్రమే ఇస్తూ నిబంధన**

**16 నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు**

**ఇప్పటికీ కొనుగోలు కేంద్రాలకు చేరని సంచులు**



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

**ధాన్యం కొనుగోలులో ప్రభుత్వ తీరు ఏమాత్రమూ మారలేదు. ఖరీఫ్‌లో ఏర్పడిన ఇబ్బందులను కనీసం పరిగణనలోకి తీసుకోకుండా 'తాము పట్టిన కుందేలుకు మూడేకాళ్లు' అన్న చందంగా వ్యవహరిస్తోంది. ప్రతి గింజనూ కొనుగోలు చేస్తామంటూ ఒకపక్క బీరాలు పలుకుతూ మరోపక్క పండిన పంటలో 60 శాతం మాత్రమే కొనుగోలు చేసేలా నిబంధనలు అమలు చేస్తోంది. సంచులపై నిబంధనలు, ధాన్యం కొనుగోలు టార్గెట్‌లపై ప్రభుత్వ తీరు ఏమాత్రమూ మారలేదు. ఈ నెల 16 నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రకటించినా ఇప్పటికీ ఏ ఒక్క కొనుగోలు కేంద్రానికి సంచులు చేరలేదు. దీంతో ధాన్యం కొనుగోలులో మళ్లీ ఇబ్బందులు తప్పవా అన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.**

రెండు జిల్లాల్లో రబీలో దాదాపు మూడు లక్షల ఎకరాల్లో రైతులు వరి పంటను సాగుచేశారు. ఏలూరు జిల్లాలో 3.90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం, పశ్చిమలో 9.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేశారు. కానీ ప్రభుత్వం మాత్రం పండిన పంటలో 60 శాతం ధాన్యం మాత్రమే కొనుగోలు చేసేవిధంగా నిబంధనలు విధించింది. దీంతో పౌరసరఫరాలశాఖ అధికారులు ఏలూరులో రెండు లక్షల మెట్రిక్ టన్నులు, పశ్చిమలో 6.47 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోలు చేసేందుకు ప్రణాళికలు రచించారు. ఒకపక్క పండిన ప్రతి గింజా కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తూ మరోపక్క 60 శాతం పంటను మాత్రమే కొనుగోలు చేసేందుకు నిబంధనలు విధిస్తూ కుప్పిగంతుల వేస్తున్న తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మండలాల్లో ధాన్యం కొనుగోలు టార్గెట్ పూర్తయిన తర్వాత మిగిలిన ధాన్యం కొనుగోలుకు మళ్లీ అనుమతులు ఇచ్చేందుకు రోజులు గడిచిపోతున్నాయి. ఖరీఫ్‌లో ఇదే పరిస్థితి నెలకొంది. ధాన్యం కొనుగోలు సీజన్‌లో ఒక్కరోజు ఆలస్యమైనా రైతులు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉంటుంది. టార్గెట్‌లు ప్రాతిపదికన ధాన్యం కొనుగోలు చేయడం ఏమిటో రైతులకు అర్థంకావడం లేదు. ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరుతో రైతులు ఖరీఫ్‌లో నానా ఇబ్బందులు పడ్డారు. తర్వాత అనుమతులు వచ్చి మిగిలిన ధాన్యం కొనుగోలు చేసేసరికి పుణ్యకాలం కాస్తా గడిచిపోయింది. రబీలోనూ అదే పరిస్థితి రానున్నట్లు సంకేతాలు కనిపిస్తున్నాయి.

**ఎకరాకు 75 సంచులు ఏ విధంగా సరిపోతాయో..!**

ప్రభుత్వం 40 కిలోల ధాన్యం పట్టేవి ఎకరాకు 75 సంచులు ఇచ్చే విధంగా నిబంధనలు విధించింది. ఈ నిబంధనతో ఖరీఫ్‌లో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో సంచులకోసం రోడ్డెక్కాల్సిన పరిస్థితి ఏర్పడింది. రబీలో ఎకరాకు 50 నుంచి 60 బస్తాల దిగుబడి వస్తోంది. ఎకరాకు 40 కిలోల సంచులు వంద ఇస్తే తప్ప రైతులకు సరిపోవు. ప్రభుత్వం మాత్రం 75 సంచుల నిబంధనతోనే ముందుకు సాగుతోంది. ఎకరాకు వందసంచులు అవసరం పడుతుందంటూ వ్యవసాయశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఇప్పటికీ సంచుల నిబంధన తొలగించడం లేదు. ఖరీఫ్‌లో ఏలూరు జిల్లాలో లారీల సమస్య తీవ్రంగా వేధించింది. రబీలోనూ సమస్య మళ్లీ వెంటాడే పరిస్థితి ఉందన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది. ఈనెల 16వ తేదీ నుంచి ధాన్యం కొనుగోలు చేయనున్నట్లు ఏలూరు జిల్లా అధికారులు ప్రకటించారు. ఒక్కరోజు వ్యవధి మాత్రమే ఉన్నప్పటికీ సంచులు మాత్రం కొనుగోలు కేంద్రాలకు చేరలేదు. పశ్చిమలోనూ ఇదే పరిస్థితి ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో ముున్ముందు పరిస్థితి ఏమిటన్న ఆందోళన రైతులను వెంటాడుతోంది.

**నిబంధనలు తొలగించాలి**

**కె.శ్రీనివాస్, రైతుసంఘం జిల్లా కార్యదర్శి**

రైతు పండించిన పంటలో 60 శాతం ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేస్తామంటూ ప్రభుత్వం విధించిన నిబంధన తక్షణం తొలగించాలి. టార్గెట్‌తో సంబంధం లేకుండా నూరుశాతం ధాన్యం కొనుగోలు చేసేవిధంగా ప్రభుత్వం ఆదేశాలివ్వాలి. ఎకరాకు వంద గోనె సంచులు ఇవ్వాల్సిందే. ఇప్పటికే రైతులు మాసూలు చేయడం ప్రారంభించారు. గోనె సంచులు అందుబాటులోకి తెచ్చి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి.



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న సిపిఎం, సిపిఐ నాయకులు

బిజెపి హయాంలో..

# పేదలపై భారాలు.. పెద్దలకు రాయితీలు

**సిపిఎం, సిపిఐ రాజకీయ ప్రచారభేరిలో నేతలు**

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

బిజెపి ప్రభుత్వం పేదలపై భారాలు, పెట్టుబడిదారులకు, బడాపారిశ్రామిక వేత్తలకు రాయితీలు కల్పిస్తుందని సిపిఎం, సిపిఐ నేతలు విమర్శించారు. నరేంద్ర మోడీని గద్దెదించుదాం దేశాన్ని కాపాడుకుందాం నినాదంతో సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన దేశ రక్షణ ప్రచారభేరి యాత్ర పలు గ్రామాల్లో సాగింది. మండలంలోని వేగవరం, ఎ.పోలవరం, మైసన్నగూడెం, శ్రీనివాసపురం, పట్టినపాలెం, అక్కంపేటగ్రామాల్లో ఈ యాత్ర సాగింది. ఈ సందర్భంగా ఉపాధి కూలీల వద్దకు వెళ్లి కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిపిఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, సిపిఐ మండల కార్యదర్శి రమణరాజు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది సంవత్సరాల కాలంలో వ్యవసాయ కూలీలు, ఉపాధి హామీ కూలీల సంపదను అంబానీ, ఆదానీలకు కట్టబెడుతున్నారన్నారు. ఉపాధి హామీకి నిధులు తగ్గించి, పన్ను రాయితీలు అంబానీ ఆదానీలకు ఇచ్చారని కేంద్రప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఎం, సిపిఐ ప్రజల కోసం చేసే కార్యక్రమంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ యాత్రలో సిపిఎం మండల కమిటీ సభ్యులు అందుగుల ప్రభాకర్‌రావు, పి.సూర్యారావు, బొడ్డు రాంబాబు, రాయల దుర్గారావు, అందుగుల ఫ్రాన్సిస్, సిపిఐ నాయకులు గోలిమే బాలయేసు, టివిఎస్.రాజు, చిట్టిబాబు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు

# ప్రభుత్వమే '108' వ్యవస్థను కొనసాగించాలి

**108 కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర మహాసభలో ఎంఎల్‌సి సాబ్జీ**

టప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

17 సంవత్సరాలుగా కనీస వేతనాలు అమలు చేయకుండా, కనీసం ఉద్యోగ భద్రత కల్పించకుండా రాష్ట్ర ప్రభుత్వం 108 ఉద్యోగులతో వెట్టిచాకిరీ చేయించుకోవడం దుర్మార్గపు చర్య ఎంఎల్‌సి షేక్ సాబ్జీ విమర్శించారు. తాడేపల్లిగూడెంలోని గుణ్ణం ఫంక్షన్ హాలులో శనివారం 108 కాంట్రాక్టు ఉద్యోగుల రాష్ట్ర మహాసభ నిర్వహించారు. ఈ మహాభకు ముఖ్యఅతిథులుగా షేక్ సాబ్జీ, సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్, ప్రభుత్వ కాంట్రాక్టు అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల రాష్ట్ర జెఎసి కార్యదర్శి నూర్‌మహ్మద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా సాబ్జీ మాట్లాడుతూ ప్రజలకు విలువైన సేవలందిస్తున్న ఇఎంఆర్, జివికె, బివిజి, అరబిందో సంస్థల కాంట్రాక్టులను రద్దు చేసి ప్రభుత్వమే 108 వ్యవస్థను కొనసాగించాలని డిమాండ్ చేశారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు నాగేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 3,500 మంది 108 కాంట్రాక్ట్ ఉద్యోగులు నిరంతరం ప్రజలకు సేవలందిస్తున్నారన్నారు. ప్రతీరోజు పగలు, రాత్రి, ఎండ, వాన, పండగ అనేవి లేకుండా అత్యవసర సమయంలో ప్రజానీకానికి 108 ఉద్యోగులు చాలీచాలని వేతనాలతో అనేక సేవలందిస్తున్నారని తెలిపారు. 17 ఏళ్లుగా వీరు తమ సేవలందిస్తున్నారన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏ ఉద్యోగికైనా పనిగంటలు ఎనిమిది గంటలేనని, కానీ 108 ఉద్యోగులు మాత్రం రోజుకి 12 గంటలు పనిచేస్తున్నారన్నారు.

కాంట్రాక్ట్ కొలువులే అయినా నెలకు పొందే వేతనాలు రూ.15వేలు మాత్రమేనని, కొంతమందికి మాత్రం రూ.28 వేలు చెల్లిస్తున్నారని తెలిపారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని చెప్పినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను మోసం చేస్తుందని ప్రశ్నించారు. ఈ మహాసభలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింహారావు కార్యదర్శి నివేదికను ప్రవేశపెట్టారు. రాష్ట్రవ్యాప్తంగా హాజరైన ప్రతినిధులు ఈ నివేదికపై చర్చించి ఆమోదం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి కర్రి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# నాడు - నేడు పనులపై కలెక్టర్ అసంతృప్తి

ప్రజాశక్తి - ముసునూరు

నాడు-నేడు పనులపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ తీవ్రఅసహనం వ్యక్తం చేశారు. మండలంలోని వేల్పుచర్లలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను కలెక్టర్ శనివారం పరిశీలించారు. ఇప్పటి వరకూ పనులు పూర్తికాకపోవడానికి కారణమేంటని కాంట్రాక్టర్‌ని ప్రశ్నించారు. ఆనంతరం మానస సరోవర్ పథకం ద్వారా అభివృద్ధి చెందుతున్న చెరువును పరిశీలించారు. డ్రోన్ల ద్వారా రీ సర్వే చేస్తున్న పనులను పరిశీలించారు. గోపవరం శివారు పెదపాటివారి గూడెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, అసహనం వ్యక్తం చేశారు. చింతలవల్లి శివారు గోగులంపాడులోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో జరుగుతున్న నాడు-నేడు పనులను పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులు చూసి పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మధ్యాహ్న భోజనం పరిశీలించి ఆహార పదార్థాలు రుచిచూశారు. వంట ఏజన్సీదారులతో మాట్లాడుతూ భోజనం బాగానే ఉందని సంతృప్తివ్యక్తం చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ రాగిజావ బాగుంటుందా? ప్రతి రోజు అందిస్తున్నారా? అని అడిగి తెలుసుకున్నారు. వీరితో పాటు నూజివీడు సబ్ కలెక్టర్ ఆదర్శ్‌రాజేంద్రన్, పీడీ రాము, ఎంపిడిఒ జి.రాణి, తహశీల్దార్ దాసరి సుధ, పంచాయతీ ఎఇ టివి.నరసింహారావు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేకుండా చూడాలి



ధాన్యం రాశులను పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - దెందులూరు

ధాన్యం కొనుగోలు వెంటనే ప్రారంభించి, రైతులకు గోనె సంచులు ఇవ్వాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని కొవ్వలి కరకట్ట వంతెన వద్ద రైతులు ఆరబెట్టిన ధాన్యాన్ని రైతు సంఘం నాయకులు శనివారం పరిశీలించారు. ధాన్యం రాశుల వద్ద రైతులకు గోనె సంచులు ఇవ్వాలంటూ నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ ధాన్యం గత పది రోజులుగా కోతలు కోసి 17శాతంలోపు తేమ వచ్చే వరకూ ఆరబెట్టి అమ్మకానికి సిద్ధం చేసినా రైతులకు గోనెసంచులు ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు మండలాల్లో ఎక్కడ చూసినా ఆరుదలకు వచ్చిన ధాన్యం రాశులే కనబడుతున్నాయని వివరించారు. సమయానికి కొనుగోలు కేంద్రాలు రైతులకు అందుబాటులో లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి రైతులకు గోనె సంచులు ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా కమిటీ సభ్యులు సున్నా వెంకట్రావు, కె.మధుసూదనరావు, ఎం.అప్పారావు, బి.సూర్యనారాయణ, ఎన్.అప్పారావు, టి.వెంకట్రావు పాల్గొన్నారు.

# హోరాహోరీగా క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఉంగుటూరు

శ్రీలక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తృతీయ వార్షికోత్సవ నియోజకవర్గ స్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలు రెండో రోజు శనివారం ఉంగుటూరులో హోరాహోరీగా జరిగాయి. మొదటి మ్యాచ్‌లో పూళ్ల వారియర్స్, అడవికొలను గరువు జట్లు తలపడ్డాయి. పూళ్ల జట్లు 85 పరుగులకు ఆలౌట్ అయింది. మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్‌గా అంజి ఎంపికయ్యారు. అడవికొలను 67 పరుగులకే ఆలౌట్ అవ్వడంతో పూళ్ల జట్టు విజయం సాధించింది. రెండో ఆటలో నారాయణపురం, నిడమర్రు ఆడగా నారాయణపురం గెలిచింది. వెంకట్ మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్‌గా నిలిచారు. మూడో మ్యాచ్ ఛానమిల్లి, కాకర్లమూడి మధ్య జరగగా కాకర్లమూడి 89 పరుగులతో గెలిచింది. రాజేష్ మ్యాన్ ఆఫ్‌ద మ్యాచ్‌గా నిలిచారు. నాలుగో ఆటలో గణపవరం, యర్రమిల్లిపాడు టీమ్‌లు తలపడగా గణపవరం గెలిచింది. విజేతలకు మెమెంటోలను ఫౌండేషన్ ఛైర్మన్ పత్సమట్ల ధర్మరాజు అందించారు.



మైదానంలో ఇరు జట్ల క్రీడాకారులు

# అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ఉంగుటూరు

నిడమర్రులో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతూ దళిత నాయకులు శనివారం ధర్నా చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు, టిడిపి ఎస్‌సి సెల్ జిల్లా అధ్యక్షుడు యాళ్ల సుజీవరావు, సిర్రా భరత్, నాయకులు నేకూరి ఆశీర్వాదం, కైకరం, నారాయణపురం సర్పంచులు సలగాల గోపీ, దిడ్ల అలకనందశ్రీను, టిడిపి అధికార పార్టీ ప్రతినిధి గంటా యువరాజ్ పాల్గొన్నారు.

# ముగిసిన 'పది' పరీక్షలు

ప్రజాశక్తి - మండవల్లి

2022-2023 విద్యా సంవత్సరం పదో తరగతి పరీక్షలు శనివారంతో ప్రశాంతంగా ముగిశాయి. ఈ నెల మూడో తేదీన తెలుగుతో ప్రారంభమైన ఈ పరీక్షలు 15వ తేదీ శనివారం సోషల్ పరీక్షతో ముగిశాయి. 2021 2022 విద్యా సంవత్సరం మండవల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చోటు చేసుకున్న మాస్ కాపీయింగ్ ఉదంతం రాష్ట్రంలోనే సంచలనమైంది. దీంతో మాస్ కాపీయింగ్‌కు సహకరించిన ఆశావర్కర్, సిఆర్‌పితో పాటు మరో ఆరుగురు ఉపాధ్యాయులను సస్పెండ్ చేశారు. ఈ మాస్ కాపీయింగ్ జరగడానికి కారణమైన ఉపాధ్యాయుడు తన రాజకీయ పలుకుబడిని వినియోగించుకుని చట్టానికి దొరకకుండా తప్పించుకుని అమాయకులను బలి చేశాడని ఆరోపణలు కూడా ఉన్నాయి. ఈ సంఘటనను దృష్టిలో ఉంచుకున్న తల్లిదండ్రులు ఈ ఏడాది ఏం జరుగుతుందోనని భయాందోళనకు లోనైనప్పటికీ ఎటువంటి సంఘటన జరగకుండా పరీక్షలు ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అయితే విద్యాశాఖ కూడా గతంలో జరిగిన మాస్ కాపీయింగ్ దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. గతంలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా ఉండే విధంగా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాల మేరకు విద్యాశాఖ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం వల్లే ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చేసుకోలేదని విద్యార్థి తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారు.

**16 మంది గైర్హాజరు**


**కలిదిండి :** సాంఘిక శాస్త్రం పరీక్షకు 16 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఎంఇఒ కొల్లాటి నరేష్‌కుమార్ తెలిపారు. మండలంలో ఐదు పరీక్షా కేంద్రాలు ఆరుతెగలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 174 మంది విద్యార్థులకు నలుగురు, కోరుకొల్లు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 268 మందికి ఇద్దరు, కలిదిండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల-ఎ కేంద్రంలో 188 మందికి ఆరుగురు, బి-కేంద్రంలో 181 మందికి ఇద్దరు, భాస్కరరావుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 137 మందికి ఇద్దరు చొప్పున పరీక్షకు గైర్హాజరయ్యారన్నారు. మొత్తం 948 విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 932 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని నరేష్ కుమార్ తెలిపారు.

**చాట్రాయి :** ఈ నెల మూడో తేదీన ప్రారంభమైన పదో తరగతి పరీక్షలు 15వ తేదీ శనివారం ముగిశాయి. స్థానిక చాట్రాయి ఆర్‌సిఎం పాఠశాలలో పదో తరగతి పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసి వస్తున్న విద్యార్థులను ప్రజాశక్తి పలకరించగా అన్ని సబ్జెక్టుల పరీక్ష పేపర్లలోని ప్రశ్నలకు సమర్థవంతంగా జవాబులు రాశామని అత్యధిక మార్కులతో పాస్ అవుతామని విద్యార్థులు ఆనందాన్ని వ్యక్తం చేశారు.

# సమస్యల హోరు.. ఆందోళనలు జోరు..!

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం దగ్గర నుంచి రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం వరకూ అవలంబిస్తున్న వివిధ ప్రజా వ్యతిరేక విధానాలపై జిల్లాలో ఆందోళనలు జోరందుకున్నాయి. తమకు పూర్తిస్థాయి పరిహారమిచ్చి వరదలు వచ్చేలోపు పునరావాస కాలనీలకు తరలించాలని పోలవరం నిర్వాసితులు, ఈ భారాలతో బతుకు బండి లాగేదెట్లా అని సామాన్య, మధ్యతరగతి ప్రజలు, తమకిచ్చిన హామీల మాటేంటంటూ ఉద్యోగ, కార్మికులు రోడ్డెక్కారు.

మండుటెండలో పోలవరం నిర్వాసితులు తమ సమస్యలు పరిష్కరించాలని, పూరిస్థాయి పరిహారం, ప్యాకేజీ ఇచ్చి వరదలు రాకముందే తమను పునరావాస కాలనీలకు తరలించాలని కోరుతూ ఏలూరు కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. 41.5 కాంటూరులో చేర్చిన పది గ్రామాల్లో వెంటనే సర్వే చేపట్టి పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలనేది ప్రధాన డిమాండ్, ఎందుకంటే జూన్ వస్తుందంటే కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రజల గుండెలు గుభిల్లుమంటున్నాయి. గతేడాది జులైలోనే ముంచెత్తిన గోదావరి వరదలు వారిని పీడకలలా వెంటాడుతూనే ఉన్నాయి. కట్టుబట్టలతో ఎటువెళ్లాలో తెలియక గుట్టలపైనా, పునరావాస కాలనీల వైపు పరుగులు తీసిన సంగతి తెలిసిందే. తీరా పునరావాస కాలనీల్లోకి సైతం నీరు చేరడంతో నిర్వాసితుల జీవనమే ప్రశ్నార్థకంగా మారింది. దీంతో తాము ఈ ప్రాంతంలో బతకడం కష్టమనే భయం వారిలో నెలకొంది. బాధిత ప్రజలకు నష్టపరిహారం ఇవ్వడంతోపాటు పునరావాస ప్యాకేజీ, పరిహారం చెల్లించి నిర్వాసితులను ఆదుకుంటామని సిఎం జగన్ ప్రకటించారు. అయితే సిఎం పర్యటన సందర్భంగా కొంత మొత్తం కొద్దిమందికి విదల్చడం మినహా తర్వాత పట్టించుకున్న దాఖలాల్లేవు. కనీసం వరదల్లో నష్టపోయిన బాధితులను ఇప్పటి వరకూ ఆదుకున్న దాఖలాల్లేవు. ఫలితంగా మళ్లీ జూన్ వస్తుందంటే నిర్వాసితుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి. ఈ నేపథ్యంలో బాధిత నిర్వాసితులంతా ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకుని ధర్నా




నిర్వహించి వినతి అందజేశారు. అలాగే ఏలూరులో జరిగిన జిల్లా సమీక్షా కమిటీ (డిఆర్‌సి) సమావేశంలోనూ పిడిఎఫ్ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ నిర్వాసితుల సమస్యలపై గళమెత్తారు. అయితే జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిగాని, ఆ ప్రాంత ఎంఎల్‌ఎ తెల్లం బాలరాజుగాని దీనిపై నోరుమెదపకపోవడం గమనార్హం. ఇక జిల్లా అధికారులైతే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామనడం తప్ప వేరే మాట ఉండటం లేదు. పైగా పరిహారం ఇవ్వకుండా, ప్యాకేజీ మాట ఎత్తకుండానే.. పునరావాస కాలనీలకు తరలివెళ్లాలని హుకుం జారీ చేయడం అధికారులకే చెల్లింది. ఓ పక్క నిర్వాసితులు దేవుళ్లు అంటూ పొమ్మనలేక పొగబెట్టినట్లు ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఎండలు సలసల.. కరోనా కలకలం**

ఓ పక్క గతంలో ఎన్నడూ లేనివిధంగా పగటిపూట ఉష్ణోగ్రతలు జనాన్ని ఠారెత్తిస్తున్నాయి. దీనికి ఉక్కబోత తోడవ్వడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకూ జనం రోడ్లపైకి రావడానికే వెనుకాడుతున్నారు. వడగాల్పుల తీవ్రత ఎక్కువగా ఉంటుందని ప్రభుత్వం హెచ్చరికలు జారీ చేయడం మినహా జనాన్ని రక్షించే చర్యలేవీ చేపట్టకపోవడం చర్చనీయాంశమైంది. కష్టజీవులు రోజంతా బహిరంగ ప్రదేశాల్లో కష్టించి పని చేస్తేగాని పొట్ట నిండని పరిస్థితి. వారికి ఉపశమనం కల్గించే చర్యలు గాని, జనం దాహార్తిని తీర్చే చలివేంద్రాల ఏర్పాటు వంటి చర్యలేవీ ప్రభుత్వం నుంచి కానరాకపోవడం గమనార్హం. ఇదే సమయంలో కరోనా కేసులు జిల్లాలో కలకలం సృష్టిస్తున్నాయి. ఇతర దేశాలు, రాష్ట్రాలకు వెళ్లొచ్చిన వారు కరోనా బాధితులుగా తేలుతున్నారు. ఏలూరు జిల్లాలో కరోనా కేసుల జోరు ఎక్కువగా ఉండగా భీమవరం జిల్లాలోనూ అక్కడక్కడా కేసులు నమోదవున్నాయి. అయినప్పటికీ మాస్క్, భౌతికదూరం వంటి అంశాలపై ప్రచారంగాని, బాధితులకు చికిత్స అందించేందుకు ప్రత్యేక చర్యలుగాని ప్రభుత్వం నుంచి లేకపోవడం గమనార్హం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వేసవి ఉపశమన చర్యలతోపాటు కరోనా కట్టడికి, బాధితులకు చికిత్సకు సంబంధించి అవసరమైన చర్యలు చేపట్టాలని జనం కోరుతున్నారు.

**- వివిఎస్‌వి.ప్రసాద్**

## అగ్ని ప్రమాద బాధితులకు సాయం

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి శనివారం అంబుల వైష్ణవి ఆర్థిక సాయం అందించారు. మండలంలోని వణుదుర్రులో శుక్రవారం విద్యుత్‌షార్ట్ సర్క్యూట్ కారణంగా గ్రామానికి చెందిన మద్దెల నందిరాజు, మంగమ్మ దంపతులకు చెందిన పూరిల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధమైంది. ఈ ప్రమాదంలో బాధిత కుటుంబసభ్యులు కట్టుబట్టలతో రోడ్డున పడ్డారు. ఈ విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ మాజీ అంబాసిడర్, వైద్య విద్యార్థిని అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదువేల నగదు, నెలకు సరిపడ నిత్యావసర సరుకులు అందించారు.

**ముదినేపల్లి** : మండలంలోని వణుదుర్రులో శుక్రవారం జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన అగ్ని బాధిత కుటుంబానికి టిడిపి యువనేత కొడాలి వినోద్ శనివారం ఆర్థిక సాయం అందించారు. విషయం తెలుసుకున్న వినోద్ పార్టీ నాయకులతో కలిసి వెళ్లి ప్రమాదం జరిగిన తీరును కుటుంబసభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం రూ.5వేలు బాధితుడు ఎం.నందిరాజుకు అందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పరసా విశ్వేశ్వరరావు, దావు నాగరాజు, వంతాని సురేష్, కట్టా మురళి పాల్గొన్నారు.

## అగ్నిమాపక కేంద్ర సేవలపై అవగాహన

**ప్రజాశక్తి - భీమడోలు**

అగ్నిభద్రతపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని భీమడోలు అగ్నిమాపక కేంద్ర అధికారి జి.నాగరాజు కోరారు. అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అగ్నిమాపక వారోత్సవాలు శనివారంతో రెండో రోజుకు చేరాయి. దీనిలో భాగంగా భీమడోలు జంక్షన్‌లోని బస్టాండ్ సమీపంగా అగ్నిమాపక కేంద్ర సేవలు ప్రజలకు తెలియజేసేందుకు అవగాహనా సదస్సు నిర్వహించారు. వారు చేపట్టే పలు రక్షణ కార్యక్రమాల గురించి డెమో ప్రదర్శన చేశారు. దీనిలో భాగంగా రివాల్వింగ్, రెవల్యూషన్, ట్రిపుల్ పర్పస్ జెట్ విన్యాసాలను సిబ్బంది ప్రదర్శించారు. దీనివల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. అనంతరం అగ్ని ప్రమాద నివారణ పద్ధతులు, రక్షణ చర్యల గురించి వివరించారు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101 ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

**చింతలపూడి** :అగ్ని ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటించాలని చింతలపూడి ఫైర్ శాఖ అధికారి వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా చింతలపూడి కొత్త బస్టాండ్ వద్ద ప్రయాణికులకు శనివారం అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు.

## అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభం

**ప్రజాశక్తి - దెందులూరు**

మండలంలోని అలుగులగూడెం రైల్వే గేటును శనివారం ఉదయం నుంచి మూసివేస్తున్నట్లు రైల్వే శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న రైల్వే గేటు స్థానంలో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మించనున్నారు. శనివారం నుంచి పనులు ప్రారంభమయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తయ్యేవరకు ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని రైల్వే అధికారులు సూచించారు. 90 రోజుల్లో అండర్ గ్రౌండ్ బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

## చలివేంద్రం ఏర్పాటు

### ప్రజాశక్తి వార్తకు స్పందన

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండల కేంద్రమైన ముదినేపల్లిలో శనివారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం ఎదురుగా, వైకుడలి వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గ్రామ సర్పంచి నిమ్మగడ్డ కైకమ్మ ప్రారంభించారు. శుక్రవారం ప్రజాశక్తిలో సుర్రుమన్న సూర్యుడు..కన్పించని చలివేంద్రాలు శీర్షికతో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. ఈ వార్తపై స్పందించిన ఇఒపిఆర్‌డి టివి.సారధి చలివేంద్రం ఏర్పాటు చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా సర్పంచి కైకమ్మ మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు దాతలు, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు రావాలన్నారు. టివి.సారధి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహాశీల్దార్ కె.శ్రీనివాస్, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, వైసిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నిమ్మగడ్డ భిక్షాలు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



చలివేంద్రం ప్రారంభిస్తున్న సర్పంచి కైకమ్మ

**జంగారెడ్డిగూడెం** : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు టిడిపి పట్టణ, అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు చేశామని టిడిపి సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు తెలిపారు. స్థానిక నిర్మలా హాస్పిటల్ ఎదురుగా టిడిపి చింతలపూడి నియోజకవర్గ మాజీ కన్వీనర్ మండవ లక్ష్మణరావు ఆర్థిక సహాయంతో చలివేంద్రం ప్రారంభించి మజ్జిగ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండవ లక్ష్మణరావు మాట్లాడుతూ టిడిపి నేతలు ప్రజాసమస్యలపై దృష్టి సారించాలని తెలిపారు. వైసిపి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు రావూరి కృష్ణ, సీనియర్ నాయకులు అబ్బిన దత్తాత్రేయ, టిడిపి రాష్ట్ర బిసి సెల్ కార్యదర్శి చిట్టిబోయిన రామలింగేశ్వరావు, కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, పగడం సౌభాగ్యవతి, నారా లోకేష్ సేవా సమితి అధ్యక్షులు ఆకుమర్తి రామారావు, పాతూరి అంబేద్కర్, చెరుకూరి శ్రీధర్, మద్దిపాటి నాగేశ్వరరావు, చిట్రోజు తాతాజీ, అల్లూరి రామకృష్ణ పాల్గొన్నారు.

**భీమడోలు** :వేసవి నేపథ్యంలో భీమడోలు గ్రామపంచాయతీ పరిధిలోని ముఖ్య ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాల సేవలు వినియోగించుకోవాలని సర్పంచి పి.సునీత మాన్సింగ్ కోరారు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం రద్దీ ఎక్కువగా ఉండే భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రాంతంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సర్పంచి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి ఠాగూర్ పాల్గొన్నారు.

# నేరాలు - ఘోరాలు

## గుండెపోటులో కూలీ మృతి

**ప్రజాశక్తి - చాట్రాయి**

కూలి పనికి వెళ్లిన వ్యక్తి గుండెపోటుతో మృతి చెందిన ఘటన మండలంలోని బూరుగుగూడెంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. పెదవేగి మండలం కవ్వగుంట గ్రామానికి చెందిన పచ్చిగోళ్ల లక్ష్మణరావు చాట్రాయి మండలంలోని బూరుగుగూడెం గ్రామానికి కొబ్బరికాయలు కోయడానికి శనివారం తోటి కూలీలతో వచ్చాడు. ఈ క్రమంలో లక్ష్మణరావు గ్యాస్ నొప్పి వస్తుందని తోటి కూలీలతో చెప్పగా వెంటనే తోటి కూలీలు స్థానిక ఆర్ఎంపి క్లినిక్‌కు తీసుకెళ్లారు. ఆర్ఎంపి డాక్టర్ వచ్చి చూసే లోపే పరిస్థితి విషమించటంతో సమాచారం అందుకున్న సమీపంలోని గ్రామ సచివాలయంలో పనిచేస్తున్న ఎఎన్ఎం, ఆశా కార్యకర్త వచ్చి వెంటనే 108కు ఫోన్ చేయగా వారు వచ్చి పరిశీలించి మృతి చెందాడని చెప్పారు. అతనికి వచ్చింది గ్యాస్ నొప్పి కాదని, గుండుపోటు వల్లే మృతి చెందాడని 108 సిబ్బంది ధ్రువీకరించారు. అనంతరం తోటి కూలీలు లక్ష్మణరావు మృతదేహాన్ని తమ స్వగ్రామమైన కవ్వగుంట గ్రామానికి తీసుకెళ్లారు.

## అక్రమంగా తరలిస్తున్న బంగారు ఆభరణాలు స్వాధీనం

**ప్రజాశక్తి - జీలుగుమిల్లి**

మండలంలోని తాటియాకులగూడెం అంతర్ రాష్ట్ర తనిఖీ కేంద్రం వద్ద శనివారం సిఐ బి.వెంకటేశ్వరావు అధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా కారులో ఎటువంటి రశీదులు, బిల్లులు లేకుండా బంగారాన్ని తరలిస్తున్నట్లు గుర్తించారు. మైలవరం గ్రామానికి చెందిన మరేమల్ల ప్రవీణ్ మనీష్‌ను అదుపులోనికి తీసుకొని అతని వద్ద నుంచి సుమారు రూ.65,79,338 విలువైన 1150.234 గ్రాముల బంగారాన్ని, కారును స్వాధీనం చేసుకున్నట్లు సిఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను అసిస్టెంట్ కమిషనర్ సెల్ టాక్స్ కార్యాలయానికి పంపినట్లు ఆయన తెలిపారు. ఈ దాడుల్లో విఆర్ఒ రామతులసి, బుల్లబ్బులు పాల్గొన్నారు.



# విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై అభ్యంతరాలు

**ప్రజాశక్తి - ముదినేపల్లి**

మండల కేంద్రమైన ముదినేపల్లిలోని అంబేద్కర్ న్యూ కాలనీ బజారుల్లో ఏర్పాటు చేస్తున్న విద్యుత్ స్తంభాల ఏర్పాటుపై కాలనీవాసులు అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. అన్ని బజారుల్లో అడ్డదిడ్డంగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయడం వల్ల తాము అనేక ఇక్కట్లు పడే అవకాశం ఉందంటున్నారు. గతంలో ఇదే విధంగా పాత కాలనీలో విద్యుత్ స్తంభాల ఏర్పాటు కారణంగా కాలనీవాసులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్లడంతో ప్రజలు అనేక ఇక్కట్లు పడ్డారన్నారు. ఇటీవల శుక్రవారం గుడ్‌ఫ్రైడే రోజు కాలనీవాసులంతా చర్చిలకు వెళ్లిన సమయంలో ఎలాంటి సమాచారం లేకుండా కాలనీలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసేందుకు విద్యుత్ శాఖ నుంచి ప్రయివేటు కార్మికులు వచ్చారన్నారు. పంచాయతీ సిబ్బంది ఎవరూ లేకుండా వారి ఇష్టారాజ్యంగా, ఇళ్ల ముందు, సొంత స్థలాల్లో అడ్డదిడ్డంగా గుంతలు తవ్వి స్తంభాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రభుత్వ స్థలంలో స్తంభాలు వేయకుండా తమ సొంత స్థలంలో స్తంభాలు ఏర్పాటు చేశారంటూ గూటం శ్రీనుతో పాటు పలువురు కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల విద్యుత్ తీగలు తమ ఇళ్లపై నుంచి వెళ్లే అవకాశం ఉందని, దీంతో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉందంటూ పలువురు కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ శాఖ అధికారులు వెంటనే స్పందించి సొంత స్థలాల్లో వేసిన, అభ్యంతరం ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే సరిచేయాలని విద్యుత్ శాఖ అధికారులను కాలనీవాసులు కోరుతున్నారు.



సొంత స్థలంలో వేసిన విద్యుత్ స్తంభాన్ని చూపిస్తున్న శ్రీను

# 8710 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం

### గుండుగొలను సొసైటీ ఆధ్వర్యాన కొనుగోలు కేంద్రం ప్రారంభం

**ప్రజాశక్తి - భీమడోలు**

గుండుగొలను విశాల సహకార పరపతి సంఘం తరపున రబీ 2022-23 సంవత్సరానికి ధాన్యం కొనుగోలును శనివారం లాంఛనంగా ప్రారంభించినట్లు సంఘ చైర్‌పర్సన్ వివివి.భాస్కర్ తెలిపారు. కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ భీమడోలు మండల పరిధిలో 13,250 ఎకరాల విస్తీర్ణంలో వరిసాగు జరగగా 56,902 మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా కట్టారన్నారు. ఎకరం ఒక్కింటికి 75 కేజీల బరువు గల 55 బస్తాల వరకు దిగుబడి వస్తుందని అధికారులు లెక్కలు కట్టారన్నారు. దీనిలో భాగంగా గుండుగొలను విశాల సహకార పరపతి సంఘానికి గ్రామ పరిధిలోని ఒకటి, రెండు, మూడు రైతు భరోసా కేంద్రాలను ధాన్యం కొనుగోలు కేంద్రాలుగా నిర్ణయించారని తెలిపారు. వీటి ద్వారా సంఘ పరిధిలోని 2010 ఎకరాల విస్తీర్ణంలో వరి సాగు ద్వారా వచ్చే 8710 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించారన్నారు. ఈనెల 17వ తేదీ నుంచి కొనుగోలు యాప్ అందుబాటులోకి రానుందని, ఆ తర్వాత రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లను అధికారికంగా ప్రారంభిస్తామని తెలిపారు. ఈ క్రమంలో రైతు భరోసా కేంద్రాలకు సహకరించేందుకు నియమితులైన సంఘ ప్రతినిధులు ధాన్యం కల్లాల వద్దకు వెళ్లి తేమ శాతం లెక్క కట్టడం, గోనెసంచుల సరఫరా చేయటం, రవాణా ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలను చేపడతారన్నారు. ధాన్యం మిల్లులకు చేరిన తర్వాత దాని తాలూకు చెల్లింపులు రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా జమ అవుతాయన్నారు. గత సీజన్‌లో సైతం సంఘం ద్వారా సేకరించిన ధాన్యం కొనుగోలు సొమ్ములు పూర్తిస్థాయిలో చెల్లించామన్నారు. ఇక ధాన్యం సరఫరా చేసిన రైతులకు 40 కేజీల బస్తా ఒక్కింటికి రూ.పది వంతున చెల్లించాల్సిన హమాలీ ఛార్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గత రబీ సీజన్‌కు చెందిన 20 శాతం బకాయిలు చెల్లించాల్సి ఉందని, సార్వా తాలూకు హమాలీ ఛార్జీలు ప్రభుత్వం నుంచి ఇప్పటివరకు విడుదల కాలేదన్నారు. ప్రస్తుత సీజన్‌లో రైతుల నుంచి సేకరించే ధాన్యానికి రైతులకు చెల్లించాల్సిన హమాలీ ఛార్జీల చెల్లింపుపై స్పష్టమైన ఆదేశాలు రావాల్సి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం సిఇఒ కె.జగదీష్ కుమార్ పాల్గొన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన సంఘ చైర్ పర్సన్

## బహిరంగ ప్రకటన

నా క్లయింటు **శ్రీమతి టి.వి.నరసమ్మ, భర్త: జంగుపల్లి భాస్కరరావు,** ఫత్తేబాద, ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కాపురస్తులు యొక్క సంజాయిషీపై తెలియజేయునది ఏమనగా..,

వారు ఏలూరు జిల్లా, ఏలూరు ఎస్.ఆర్.ఓ. పత్తేబాద, 31వ డివిజన్ టి.ఎస్.నెం. 446లో చేరియున్న 88.5.0 అ॥లు గల ఆర్.సి.సి. డాబా ఇంటి యొక్క ది.09-11-2000, డాక్యుమెంటు నెం. 9236/2000 గల క్రయ దస్తావేజును ఇతర డాక్యుమెంటు ద్వారా పొందియున్నారు. సదరు ఒరిజినల్ దస్తావేజు యొక్క లింకు దస్తావేజును ది. 10-04-2023 న ఏలూరు పాత బస్టాండు సమీపమున పోగొట్టుకొని యున్నారు. ఎవరికైనా లభించిన ఎడల నాకు తెలియపర్చగలరు. ఎవరైననూ సదరు ఆస్థితో ఎటువంటి వ్యవహారములు చేసిన ఎడల చెల్లవు.

**మారిశెట్టి సుశీల**
అడ్వకేట్, ఏలూరు. సెల్: 85209 78581

## భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నాగేశ్వరరావు

**ప్రజాశక్తి - భీమడోలు**

భీమడోలు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా కె.నాగేశ్వరరావు ఎన్నికయ్యారు. శనివారం భీమడోలు కోర్టు ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయనతో పాటు 2023-24 సంవత్సరానికి నూతనంగా ఎన్నికైన ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలను స్వీకరించారు. దీనిలో భాగంగా అధ్యక్షులతో పాటు ఉపాధ్యక్షులు జి.వరప్రసాదబాబు, ప్రధాన కార్యదర్శి డి.రాంబాబు, కోశాధికారి ఐ.విజయ అచ్యుతం, కార్యదర్శి బివిడిఎల్ (లెనిన్) నారాయణ సంయుక్త కార్యదర్శి వి.రాంబాబు, మహిళా ప్రతినిధి సుధారాణి పాల్గొన్నారు. నూతన అధ్యక్షులుగా బాధ్యతలను స్వీకరించిన కె.నాగేశ్వరరావు మాట్లాడుతూ, భీమడోలు కోర్టుకు శాశ్వత భవన నిర్మాణానికి అసోసియేషన్ తరపున కృషి చేస్తానన్నారు. ఇదే క్రమంలో భీమడోలు బార్ అసోసియేషన్ ప్రత్యేక భవనం ఏర్పాటుకు తన వంతు సహకారాన్ని అందిస్తానన్నారు. కోర్టు ద్వారా అమలు చేసే వివిధ ప్రభుత్వ కార్యక్రమాలకు అసోసియేషన్ తరపున సహాయ సహకారాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు గీతాంజలి, గంగాధరరావు గెడా కృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## రెయిన్ బో ఆధ్వర్యాన గుండె జబ్బుల స్క్రీనింగ్ క్యాంపు

**ప్రజాశక్తి - ఏలూరు టౌన్**

జిల్లా కేంద్ర ఆసుపత్రిలోని ఆర్‌బిఎస్‌కె కేంద్రంలో శనివారం రెయిన్ బో హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్న పిల్లల గుండె జబ్బులు స్క్రీనింగ్ క్యాంపును జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఆశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చాలా మంది పిల్లలు గుండెకు సంబంధించిన వ్యాధులతో బాధ పడుతున్నారని, వ్యాధి లక్షణాలు బయటకు తెలియకపోవడంతో వ్యాధి ఉన్న సంగతి వారికి తెలియడంలేదన్నారు. చాలా మందిలో చిన్న చిన్న చికిత్సలతో గుండె వ్యాధులను సరిచేయవచ్చన్నారు. ఆర్‌బిఎస్‌కె వారు రెయిన్ బో హాస్పిటల్ వారు అప్పుడే పుట్టిన పిల్లల నుంచి 15 ఏళ్ల లోపు వయస్సు కలిగిన చిన్న పిల్లల్లో గుండెకు సంబంధించిన వ్యాధులు గుర్తించేందుకు ప్రత్యేక స్క్రీనింగ్ క్యాంపును ఏర్పాటుచేసి, క్యాంపులో గుండె వ్యాధులను గుర్తించిన వారికి ఉచితంగా చికిత్స అందిస్తారన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెయిన్ బో హాస్పిటల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్ డాక్టర్ భార్గవి మాట్లాడుతూ ప్రారంభ దశలోని గుండె వ్యాధులను గుర్తించగలిగితే, వాటిలో కొంతమందికి బటన్ విధానం, బెలూన్, స్టంట్ ద్వారా చికిత్స అందించి 24 గంటల్లోగా డిశ్చార్జ్ చేస్తారని తెలిపారు. ప్రతి ఆరునెలలకు ఇటువంటి స్క్రీనింగ్ క్యాంపు ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్‌బిఎస్‌కెలో ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రజలు తమ పిల్లల వివరాలను ఆర్‌బిఎస్‌కె కేంద్రంలో నమోదు చేసుకోవాలన్నారు. స్క్రీనింగ్ క్యాంపులో గుండె వ్యాధులు గుర్తించిన వారికి లిటిల్ హార్ట్ ఫౌండేషన్ వారి సహకారంతో ఉచిత చికిత్స అందించనున్నట్లు తెలిపారు. శనివారం నిర్వహించిన స్క్రీనింగ్ క్యాంపులో 30 మంది పిల్లలను పరీక్షించినట్లు తెలిపారు. వారిలో 40 శాతం మంది వివిధ గుండె వ్యాధి లక్షణాలను గుర్తించినట్లు, వీరికి తమ సంస్థ ద్వారా చికిత్స అందించనున్నట్లు తెలిపారు.

## గృహ నిర్మాణాల్లో మొదటిస్థానం సాధించాలి

**ప్రజాశక్తి - భీమడోలు**

జగనన్న గృహ నిర్మాణాల్లో జిల్లాలో ఐదో స్థానంలో ఉన్న భీమడోలు మండలాన్ని ప్రథమ స్థానంలోకి తీసుకొచ్చేందుకు బాధ్యులందరూ సహకరించాలని భీమడోలు ఎంపిడిఒ రాఘవన్ కోరారు. జగనన్న గృహ నిర్మాణాలను, నాడు-నేడు పథకం కింద నిర్మాణాలు చేపట్టిన పాఠశాల భవనాల ప్రగతిని పరిశీలించేందుకు శనివారం సాయంత్రం ఆయన మండలంలో పర్యటించారు. ఈ పర్యటనలో ఆయనతో పాటు గృహ నిర్మాణ సంస్థ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన సహాయ ఇంజినీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 27 జగనన్న లే అవుట్లలో 2086 గృహాల నిర్మాణాలకు అనుమతులు లభించాయన్నారు. ఇప్పటివరకు 1003 గృహాల నిర్మాణాలు పూర్తి చేసుకున్న మండలం జిల్లా స్థాయిలో గుర్తింపు పొందిందన్నారు. మిగిలిన లబ్ధిదారులను చైతన్యపరిచి గృహనిర్మాణాలు నూరు శాతం పూర్తి చేసే క్రమంలో మండల కమిటీలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కమిటీలు ప్రతి శనివారం ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం ఏడు గంటల వరకు గృహ నిర్మాణాలు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి లబ్ధిదారులను చైతన్యపరిచి నిర్మాణాలను వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటారన్నారు. దీనికోసం ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని ఆయన తెలిపారు.



లబ్ధిదారులతో చర్చిస్తున్న ఎంపిడిఒ రాఘవన్

## గూటాలలో 'హౌసింగ్ డే'

**ప్రజాశక్తి - పోలవరం**

మండలంలోని గూటాల గ్రామంలో శనివారం నిర్వహించిన హౌసింగ్ డే కార్యక్రమాన్ని పురస్కరించుకుని నూతనంగా ఇల్లు మంజూరైన లబ్ధిదారులతో తహాశీల్దార్ బి.సుమతి సమావేశమై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం కొత్త పట్టిసీమ గ్రామంలో నూతనంగా ప్రారంభించిన చలివేంద్రాన్ని పరిశీలించారు. ఈ వేసవిలో చలివేంద్రాలు ప్రజల దాహార్తిని తీర్చడానికి ఎంతో ఉపయోగపడతాయన్నారు. అదేవిధంగా పదో తరగతి చివరి రోజు నేపథ్యంలో పరీక్షా కేంద్రాలను తహాశీల్దార్ బి.సుమతి పరిశీలించారు.

## వంకవారిగూడెంలో 'జగనన్నే మా భవిష్యత్తు'

**జీలుగుమిల్లి** :మండలంలోని వంకవారిగూడెం పంచాయతీలో శనివారం సర్పంచి కుంజ పార్వతి అధ్వర్యంలో జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జెసిఎస్ కన్వీనర్లు, సచివాలయ కన్వీనర్లతో కలిసి పంచాయతీలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం ప్రవేశపెట్టిన కార్యక్రమాలను ప్రజలకు వివరించినట్లు తెలిపారు. ఒక్కో ఇంటికి ఎంత లబ్ధి పొందారో వివరించారు. అనంతరం గడపగడపకూ స్టికర్లు అంటించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కుంజ చినరాముడు, పార్టీ గ్రామ అధ్యక్షులు వంకా రామకృష్ణ, సచివాలయ కన్వీనర్ లక్ష్మణరావు, మడకం శేషగిరిరావు, కారం నాగేశ్వరరావు, సున్నం రామారావు పాల్గొన్నారు.

## అంబేద్కర్ పేరుతో భవనాల నిర్మాణం

**మండవల్లి** :కైకలూరు నియోజకవర్గంలోని మండల కేంద్రాల్లో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పేరుతో భవనాలను నిర్మించేలా ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు చర్యలు తీసుకోవడం హర్షనీయమని అంబేద్కర్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్ఎస్.భాస్కరరావు అన్నారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఆయన ఈ మేరకు హామీలు ఇచ్చారని తెలిపారు. ఈ సందర్భంగా భాస్కరరావు మాట్లాడుతూ ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు సర్పంచిగా ఉన్నప్పుడే కైకలూరు నియోజకవర్గంలో అంబేద్కర్ భవనానికి 12 సెంట్ల స్థలాన్ని కేటాయించినట్లు చెప్పారు. నేడు భవన నిర్మాణ పనులు చేపట్టి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటానని ఆయన స్పష్టం చేశారని వివరించారు. మండవల్లి, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో అంబేద్కర్ భవనాలను నిర్మించేలా ఆయన హామీ ఇచ్చారన్నారు. మండవల్లి, కైకలూరు, ముదినేపల్లి, కలిదిండి మండలాల్లో అంబేద్కర్ పేరుతో భవనాల నిర్మాణం జరిగితే పేదలకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. మండవల్లిలో స్థానిక సెంటర్‌లో ఉన్న ప్రభుత్వ భూమిని 50 సెంట్లు కేటాయించి భవనం నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరగా ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు.

## పత్రిక ప్రకటన

**మహారాజ శ్రీ తాడేపల్లిగూడెం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో**
**ఓ.యస్.నెం. 194/2015**

బిట్వీన్ :
శ్రీ మండ మురళీ కృష్ణ ...వాది
మరియు
శ్రీమతి తోట వెంకయమ్మ వగైరాలు ...ప్రతివాదులు

**D5** శ్రీ తోట నారాయణ రావు, తండ్రి : నాగేశ్వర రావు, వయస్సు 61 సం.లు, C/o శ్రీ తోట వెంకటేశ్వర రావు, డి.ఎన్.ఆర్ కాలేజ్ రోడ్, డి.నెం.26-3-1, ఆంధ్రా బ్యాంక్ ఎదురు వీధి, భీమవరం.
**D6** శ్రీమతి తిరుమలశెట్టి విజయలక్ష్మి, భర్త : ఉమా శంకర్, **M.B.B.S.**, వయస్సు 59 సం.లు, C/o శ్రీ తోట వెంకటేశ్వర రావు, డి.ఎన్.ఆర్ కాలేజ్ రోడ్, డి.నెం.26-3-1, ఆంధ్రా బ్యాంక్ ఎదురు వీధి, భీమవరం.
**D7** శ్రీమతి పెన్నెరు మాణిక్యాంబ, భర్త : భాస్కర రావు, రిటైర్డ్ లెక్చరర్, వయస్సు 58 సం.లు, C/o శ్రీ తోట వెంకటేశ్వర రావు, డి.ఎన్.ఆర్ కాలేజ్ రోడ్, డి.నెం.26-3-1, ఆంధ్రా బ్యాంక్ ఎదురు వీధి, భీమవరం.
**D8** శ్రీమతి పైడిపర్తి బుల్లెమ్మ శైలజ, భర్త : డా॥ జగన్‌మోహన్, వయస్సు 54 సం.లు, C/o శ్రీ తోట వెంకటేశ్వర రావు, డి.ఎన్.ఆర్ కాలేజ్ రోడ్, డి.నెం.26-3-1, ఆంధ్రా బ్యాంక్ ఎదురు వీధి, భీమవరం.

పై నెంబరు దావాలో ప్రతివాదులు అయిన 5,6,7,8వ ప్రతివాదులకు ఎన్నిమార్లు దావా సమన్లు పంపిననూ అమలు కానీ కారణముగా శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం పత్రిక ప్రకటన ద్వారా 5,6,7,8వ ప్రతివాదులకు దావా సమన్లు అమలు చేసే విధముగా ఆర్డర్ పొందియున్నారు. కావున ఇందలి 5,6,7,8వ ప్రతివాదులపై నెంబరు దావాలో వారి ఆక్షేపణలు తెలియజేసుకొనుటకు **ది.08-05-2023 వ తేదీ ఉదయం 10.30 నిముషాలకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా గాని ప్లీడరు ద్వారా గాని ఆక్షేపణలు తెలియజేసుకొనవలెను. లేని యెడల వారి పరోక్షముగా దావా తదుపరి చర్యలు జరుగునని ఇందుమూలముగా తెలియజేయడమైనది. **వాయిదా తేది.08.05.2023**

స్థలం : తాడేపల్లిగూడెం
తేది : 15.04.2023
**Sd/- శ్రీ దశిక మురళీ కృష్ణ**
**అడ్వకేట్, తాడేపల్లిగూడెం.**

## In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku

**O.S.No. 588/2020**

***Between:***
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
**VS**
Vemula Krishna another ***...Defendant***

**వాది తరుపున చేసిన ప్రకటన**

*ప్రతివాదులు:*
1) వేముల కృష్ణ, తండ్రి: సత్యం, హిందువు, పురుషుడు, 59 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) వేముల శ్రీనివాస్, తండ్రి: భాస్కరరావు, హిందువు, పురుషుడు, 49 సం॥లు, డో.నెం. 22-5-8, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.17-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

**T.RAMA DEVI**
Advocate, Tanuku.

## In The Court Of The Principal Junior Civil Judge :: Tanuku

**O.S.No. 600/2020**

***Between:***
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Tanuku ***...Plaintiff***
**VS**
Vemula Yarraiah another ***...Defendant***

**వాది తరుపున చేసిన ప్రకటన**

*ప్రతివాదులు:*
1) వేముల యర్రయ్య, తండ్రి: సూరన్న, హిందువు, పురుషుడు, 63 సం॥లు, డో.నెం. 4-120, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) పజ్జూరి వీరమణి, భర్త: శ్రీనివాసరావు, హిందువు, స్త్రీ, 38 సం॥లు, డో.నెం. 20-5-6ఎ, పాలకొల్లు, పాలకొల్లు JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.17-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

**N.RAVI SANKHAR**
Advocate, Tanuku.

## In The Court Of The 1st Additional Junior Civil Judge :: Tanuku

**O.S.No. 667/2020**

***Between:***
Bank of Baroda (Erstwhile Vijaya Bank), Alamuru ***...Plaintiff***
**VS**
Pajiuri Veeraswamy another ***...Defendant***

**వాది తరుపున చేసిన ప్రకటన**

*ప్రతివాదులు:*
1) పజ్జూరి వీరాస్వామి, తండ్రి: గోపాలరావు, హిందువు, పురుషుడు, 44 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.
2) వేముల రాజేశ్వరరావు, తండ్రి: వెంకటేశ్వరరావు, హిందువు, పురుషుడు, 56 సం॥లు, గగ్గిపర్రు, యలమంచిలి మండలం, నర్సాపురం JCJC.

పై నెంబరు దావా గ్రంధములో ప్రతివాదులైన మీకు ఎన్ని పర్యాయములు సమన్లు పంపించిననూ మీకు అమలు జరగనందున శ్రీ కోర్టు వారి ఆదేశముల ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది ఏమనగా మీరు **ది.17-04-2023వ తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు స్వయంగా గాని, ప్లీడరు ద్వారా గాని పై కోర్టు నందు హాజరై మీ తాలూకా ఆక్షేపణలు తెలియజేసుకొనవలసినదిగాను** అట్లు కాని ఎడల మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియపర్చడమైనది.

**D.S.V.KRISHNAJI**
Advocate, Tanuku.

## డెంటల్ క్లినిక్ ప్రారంభం

**చింతలపూడి** :పట్టణంలో పాత బస్టాండ్ వద్ద పంచాయతీ కాంప్లెక్స్‌లో ఏర్పాటు చేసిన శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ డెంటల్ క్లినిక్‌ని ఎంఎల్ఎ ఎలిజా శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యాధునిక టెక్నాలజీ సాయంతో డెంటల్ నిర్వహించనున్నారని, అందరూ వినియోగించుకోవాలని తెలిపారు.

## ప్రసాద్ మృతి తీరని లోటు

**చింతలపూడి** :వైస్ ప్రెసిడెంట్‌గా ప్రసాద్ పార్టీకి చేసిన సేవలు మరువలేమని సీతానగరం సర్పంచి గాయం మల్లేశ్వరి అన్నారు. మండలంలోని సీతానగరం పంచాయతీ వైస్ ప్రెసిడెంట్ ప్రసాద్‌బాబు అకాల మృతిపై పంచాయతీ కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని, పార్టీ బలోపేతానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఆయన మృతి పార్టీకి, పంచాయతీకి తీరని లోటన్నారు.

**మహారాజశ్రీ 2వ అదనపు జిల్లా కోర్టు వారి దివ్య సముఖమునకు :: అమలాపురం**

**ఐ.ఎ.నెం. 1010/2022**
**ఓ.ఎస్.నెం. 29/2016**

**బిట్వీన్:**
తిక్కా రామకనక దుర్గావరప్రసాద్ **...పిటీషనరు /వాది**
**మరియు**
కుచ్చర్లపాటి స్వరాజ్య లక్ష్మి వగైరాలు **...రెస్పాండెంట్లు /ప్రతివాదులు**

**పేపరు ప్రకటన**

**ఆర్-5: రెస్పాండెంటు /ప్రతివాది:**
వలవల సత్యనారాయణ, తండ్రి: సుబ్బారావు, హిందూ, Inam, Narni Meraka, Elamanchili Mandal, W.G.Dist.

పై నెంబరు దావాలో ఓ.ఎస్.నెం. 29/2016లో ఐ.ఎ.నెం. 1010/2022లో 5వ రెస్పాండెంటు /ప్రతివాది అయిన మీకు ఎన్ని పర్యాయములు నోటీసు పంపిననూ అమలు జరిగియుండలేదు. శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 5వ రెస్పాండెంటు /ప్రతివాది అయిన మీకు పేపరు ప్రకటన ద్వారా మీకు తెలియపరచుచున్నాము. వాయిదా **ది.19-04-2023వ తేదీన మీరు స్వయంగా గాని, మీరు మీ ప్లీడరు గారి ద్వారా గాని వచ్చి గం॥ 10:30 ని॥లకు శ్రీ కోర్టు వారి ఎదుట హాజరై మీయొక్క అభ్యంతరములు తెలియపరచుకోవలెను.** లేనిచో పరోక్షముగా తీర్మానితులు అవుదురు.

**వాయిదా : ది.19-04-2023**
**సమయం : 10:30 ని॥లకు**

**కె.మల్లపురాజు**
**కె.ఎస్.శ్రీరామ్**
అడ్వకేట్స్, అమలాపురం.

## In The Court Of The Senior Civil Judge :: Tadepalligudem

**O.S.No. 26/2019**

***Between:***
1) Amirisetti Sridevi and 2 Others ***...Plaintiffs***
**Vs**
1) Thota Naga Veera Bhadra Rao and 4 Others ***...Defendants***

***4th Defendant:***
Gonemadathala Naga Satya Sai Durga Devi, W/o. Satish, D.No. 5-22, Relangi Village, Iragavaram Mandalam, West Godavari District, Tanuku SCJ.

**SUIT SUMONS**

Please take suit sumons in the above matter filed by the plaintiffs against you for declaration of title of the Plaintiffs No. 1 to 3 over the plaint schedule properties by holding that the alleged registered partition deed dated 31-08-2018 vide document no. 4515/2018 is null and void under eye of law and for permanent injuction etc.., The Honourable court issued suit summons to you number of times, but you are avoiding to take suit summons. So, the Honourable court ordered the suit summons by way of publication to you through the Prajasakti News Paper, Tanuku. So, you are here by directed to appear before the **Honourable court at 10:30 A.M. on 03-05-2023** to which date the above suit stands posted, either in person or through an advocate and file your written statement if any regarding the objections to the suit, If you are failed to appear before the Honourable court at 10:30 A.M. on 03-05-2023 the suit will decided in your absence.

**(By Order Of The Court)**

**K.MANI KUMAR**
Advocate for Plaintiff,
Tadepalligudem.

## In The Court Of The Senior Civil Judge :: Tadepalligudem

**I.A.No. 1214/2019**
**in O.S.No. 26/2019**

***Between:***
1) Amirisetti Sridevi and 2 Others ***...Petitioners /Plaintiffs***
**Vs**
1) Thota Naga Veera Bhadra Rao and 4 Others ***...Respondents /Defendants***

***4th Respondent:***
Gonemadathala Naga Satya Sai Durga Devi, W/o. Satish, D.No. 5-22, Relangi Village, Iragavaram Mandalam, West Godavari District, Tanuku SCJ.

**NOTICE**

Please take notice in the above matter filed by the Petitioners /plaintiffs against you for temporary injuction in favour of the Petitioners No. 1 to 3 against the respondents no. 1 to 5 restraining the respondents no. 1 to 5 in interfering with the peaceful possession and enjoyment of the petition schedule properties by the petitioners no. 1 to 3. The Honourable court issued notices to you number of times, but you are avoiding to take notices. So, the Honourable court ordered the notices by way of publication to you through the Prajasakti News Paper, Tanuku. So, you are here by directed to appear before the **Honourable court at 10:30 A.M. on 03-05-2023** to which date the above petition stands posted, either in person or through an advocate and file your counter if any regarding the objections to the petition, If you are failed to appear before the Honourable court at 10:30 A.M. on 03-05-2023 the petition will decided in your absence.

**(By Order Of The Court)**

**K.MANI KUMAR**
Advocate for Plaintiff,
Tadepalligudem.